www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 19 ఆగస్టు 2024
5
అన్నమయ్య

నేడు యథావిధిగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక

- కలెక్టర్ శ్రీధర్ చామకూరి

ప్రజాశక్తి-రాయచోటి

ప్రజల నుంచి వారి సమస్యలను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు సోమవారం ఉదయం 10గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (ఎకార్యక్రమాన్ని జిల్లా కేంద్రం రాయచోటితో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రాగలరని తెలిపారు.

రెచ్చిపోతున్న మైనింగ్ మాఫియా

- అధికారం మారినా.. మాఫియా మారలేదు
- సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు

సమ్మర్ స్టోరేజ్ వద్ద నిల్వ ఉంచిన ఇసుక

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

అధికార పార్టీ అండదండడలతో మైనింగ్ మాఫియా చెలరేగిపోయి ఇసుక, మట్టి కొల్లగొడుతుందని సిపిఎం అన్నమయ్య జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు అన్నారు. అధికారంలో ఉన్న పార్టీలు మారినా మైనింగ్ మాఫియా మారలేదని, ఎవరు అధికారంలో ఉంటే వారి పంచన చేరుతున్నారని వివరించారు. ఆదివారం మదనపల్లి పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఇసుక విధానం కారణంగా జిల్లాలో ఉన్న ప్రజలకు ఇసుక అందుబాటులోకి లేకుండా పోయిందని అన్నారు. భవన నిర్మాణ పనులు జరగడం లేదని, భవన నిర్మాణ కార్మికులకు పనులు కరువయ్యాయని వాపోయారు. మైనింగ్ మాఫియా మాత్రం అధికార పార్టీ అండదండలతో పెద్ద ఎత్తున ఇసుకను తరలించకపోతున్నారన్నారు. మదనపల్లి పట్టణ సమీపంలో ఉన్న చిప్పిలి సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో బార్లపల్లి మోహన్, మధుసూదన్ రెడ్డి, అంకిశెట్టిపల్లి జగదీష్, మణికుమార్, ఎఎన్ఎస్ శ్రీనివాసులు, అమర తదితరులు రోజూ రాత్రి 9 గంటల నుండి మరుసటి రోజు ఉదయం 6 గంటల వరకు టిప్పర్లతో రూ. లక్షల విలువ చేసే ఇసుకను తోడి, తరలిస్తున్నారని, అయినా అధికారులు అటువైపు కన్నెత్తి చూడలేదని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో నెల్లూరు ప్రసాద్‌రెడ్డి, రాంబాబు మొదలగు వారు ఇసుక మైనింగ్‌లో ఆరితేరిపోయారని బహుదా, మహల్, కలకడ మొదలగు ప్రాంతాల్లో ఇసుకను అక్రమంగా తోడేసి విక్రయిస్తున్నారని చెప్పారు.. ప్రస్తుత ప్రభుత్వంలో కూడా చౌడేపల్లి మండలం, చదల్ల వద్ద హిటాచీలతో ఇసుకను అక్రమంగా తోడుకుని ఒక టిప్పర్ ధర రూ. 10 వేల నుంచి 15 వేలకు అమ్ముకుంటూ రోజుకు 50 నుంచి 100 టిప్పర్ల ఇసుకను తరలించేస్తున్నారని వివరించారు. నిమ్మనపల్లి మండలం అగ్రహారం వద్ద కూడా షంషేర్ కనుసన్నల్లో రోజూ ఇసుకను మదనపల్లెకు అక్రమంగా తరలిస్తున్నారని అన్నారు. అధికార పార్టీ నాయకులకు కప్పం కట్టని ఇసుక ట్రాక్టర్లు మాత్రమే పోలీసులకు పట్టుబడుతున్నాయని, ఒక్క టిప్పర్ కూడా అధికారుల కంట పడలేదంటే అనుమానం కలుగుతోందని అన్నారు. మైనింగ్, ఎస్ఇబి, ఇరిగేషన్ రెవెన్యూ, పోలీసు అధికారులు మాఫియాతో కుమ్మక్కైనందువల్ల ఇసుక యథేచ్ఛగా తరలించకు పోగలుగుతున్నారని, చిన్న చిన్న వాగులు కుంటల్లో పేదలు ఎత్తే ఇసుకకు మాత్రం తీవ్రమైన ఆంక్షలు విధిస్తూ రూ. వేలకు వేలు ఫైన్లు వసూలు చేస్తున్నారే తప్ప, టిప్పర్లతో రూ. లక్షల విలువ చేసే ఇసుకను తరలిస్తున్న వారి జోలికి వెళ్లడం లేదని, అందుకనే ఒక్క టిప్పర్ కూడా పట్టుబడలేదని అన్నారు. బికేపల్లి, కోళ్లబైలు, పొన్నూటిపాలెం, పోతబోలు కొండామరిపల్లి, బసినికొండ తదితర రెవెన్యూ గ్రామాలలో అక్రమంగా మట్టిని తవ్వుకుని రూ. లక్షల అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. జెసిబి శంకర, వేణు, మధు, అమర, శ్రీనివాసులు తదితరులు మట్టిని తరలించి డంపింగ్ చేస్తున్నా అధికారులకు కనపడకపోవడం దుర్మార్గం అన్నారు. బైపాస్ రోడ్డులో రాయల్ వుడ్ దగ్గర, అన్నమయ్య సర్కిల్, చేనేతనగర్ తదితర ప్రాంతాల్లో రోడ్డుకు అనుకునే వేల టిప్పర్‌ల మట్టిని తరలించి కుప్పలుగా పోస్తున్నా మామూళ్ల మత్తులో జోగుతున్నందునే మైనింగ్, ఎస్ఇబి, ఇరిగేషన్ రెవెన్యూ, పోలీసు అధికారులకు కంటపడలేదని విమర్శించారు. మదనపల్లి శాసనసభ్యులు షాజహాన్‌బాషా మైనింగ్ మాఫియాను సహించేది లేదని ప్రకటించడాన్ని స్వాగతించామని, అందుకు నిర్దిష్ట చర్యలు తీసుకోవాలని కోరారు. మైనింగ్ మాఫియాకు వ్యతిరేకంగా ప్రజలను కూడగట్టి ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు

తల్లీ బిడ్డల మృతిపై

అనుమానాలను నివృత్తి చేయండి

నిజ నిర్ధారణ కమిటీ డిమాండ్

మృతురాలి బంధువులను విచారిస్తున్న నిజ నిర్ధారణ కమిటీ బృందం

ప్రజాశక్తి - రాయచోటి

పట్టణంలోని బోస్ నగర్, తొగటవీధిలో శనివారం తెల్లవారుజామున అనుమానస్పద స్థితిలో మృతి చెందిన ఎర్రగుడి రమాదేవి(33) ఆమె ఇద్దరు బిడ్డల మృతి ఘటనపై ఉన్న అనుమానాలన్నింటినీ పోలీసులు నివృత్తి చేయాలని నిజ నిధారణ కమిటీ, పౌర హక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి సి. వెంకటేశ్వర్లు, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ రాష్ట్ర సహాయ కార్యదర్శి టి. ఈశ్వర్, ఎంఆర్‌పిఎస్ జాతీయ నాయకులు ఎస్. రామాంజనేయులు డిమాండ్ చేశారు. ఆదివారం పౌర హక్కుల సంఘం, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ, రజక సంఘం నేతృత్వంలో ఏర్పడిన నిజ నిర్ధారణ కమిటీ స్థానికులను, రక్త బంధువులను, పోస్టుమార్టం నిర్వహించిన డాక్టర్లను , పోలీసులను విచారించి సంఘటనపై వాస్తవాలు తెలుసుకుంది. అనంతరం ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ రమాదేవి, ఆమె ఇద్దరు బిడ్డలను ముందుగా చంపి గ్యాస్ లీక్ చేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లుగా పోలీసులు ముందుగానే నిర్ధారణకు వచ్చి మృతి చెందిందని కేసు నమోదు చేయడం అనేది సరైన పద్ధతి కాదని వారన్నారు. రమాదేవి ఆత్మహత్య చేసుకుంది నిజమైతే మృతదేహం పక్కనే ఒక ప్లాస్టిక్ బాటిల్ ఏమాత్రం కాలకుండా ఉందని, దానిని పోలీసులు సీజ్ చేసి ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించి ప్లాస్టిక్ బాటిల్ ను ఎవరు,ఎందుకు ఉపయోగించారనే అనే విషయాన్ని తెలుసుకోవడానికి వేలిముద్రల నిపుణులకు పంపించాల్సి ఉండగా పోలీసులు ఆ పని చేయలేదు అని వారన్నారు. బెడ్ రూమ్‌లో గ్యాస్ లీక్ చేసి రమాదేవి చనిపోయింది నిజమైతే అదే రూములో ఉన్న బెడ్ కానీ ఇతర వస్తువులు గాని ఏమాత్రం అగ్నికి ఆహుతి కాలేదని అనుమానం వ్యక్తం చేశారు. రూమ్ అంతా గ్యాస్ నిండిన తర్వాత నిప్పు అంటించుకుని ఉంటే రూమ్ గోడలకు అంతటికి మసి వారి ఉండాలి కానీ, అలాంటి ఛాయలు అక్కడ లేవు, బెడ్ రూమ్‌లోనే గ్యాస్ సిలిండర్ ఉందని పోలీసులు చెబుతున్నప్పటికీ అదే సిలిండర్ అగ్నిలో కాలినట్లు ఏమాత్రం మసి మరకలు లేవన్నారు. అప్పుడే సిలిండర్ తెచ్చి పెట్టినట్లుగా ఉన్నది అని వారన్నారు. మృతురాలి ఇంట్లో నుండి పొగ బయటికి వచ్చిన నిమిషాలలోపే ప్రత్యక్ష సాక్షులు ఆమె ఇంట్లోకి వెళ్లి చూడగా అప్పటికే ఏమాత్రం కదలకుండా పడి ఉండిన మృతదేహాలను చూశామని ప్రత్యక్ష సాక్షులు కమిటీ దృష్టికి తీసుకు వచ్చారని వారన్నారు. కువైట్ లో ఉన్న భర్త పెట్టే వేధింపులు తాళలేక రమాదేవి పిల్లలతో సహా ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు ఇప్పటికే ఒక నిర్ధారణకు వచ్చారు అన్నారు. అదే వీధికి చెందిన ఓ మహిళ రమాదేవితో ఘర్షణపడిందన్నారు. తన భర్తతో వివాహేతర సంబంధం కొనసాగిస్తుందని మృతురాలి ఇంటి ఎదుట రాత్రి రెండు గంటల సమయం వరకు రభస చేసి రభస అనంతరం మృతురాలి ఇంటి తలుపులు పగలగొట్టే ప్రయత్నం చేసిందని తెలిపారు. ఆ మహిళ రమాదేవిని 'లోపల చస్తావా బయటకు వచ్చి నా చేతిలో చస్తావా' అని గట్టిగా బజారులో అర్ధరాత్రి రెండు గంటల వరకు కేకలు వేసినట్లు కమిటీ దృష్టికి వచ్చిందని తెలియజేశారు. అనంతరం కువైట్‌లో ఉన్న మృతురాలి భర్త కంట్రోల్‌లో పనిచేస్తున్న సిసి కెమెరాలు ఆపేసిన విషయం కూడా తెలిసిందని వారన్నారు. అనంతరం రమాదేవి తెల్లవారుజామున తల్లి బిడ్డలు శవాలుగా తేలినట్లు కమిటీ దృష్టికి వచ్చిందని అన్నారు. మృతురాలిపై గొడవకు దిగిన మహిళ భర్తకు, మృతురాలు రూ. లక్షల అప్పుగా ఇచ్చినట్లు ఈ మధ్యకాలంలో తన డబ్బులు తనకు వెనక్కి ఇవ్వాలని మృతురాలు తీవ్రంగా ఒత్తిడి చేయడం జరిగిందని కమిటీ విచారణలో తేలింది. అంతేకాకుండా మృతురాలిపై దాడికి దిగిన మహిళ భర్త తన గొంతు కోసుకుని ఆసుపత్రిపాలైనట్టు కూడా కమిటీ దృష్టికి వచ్చిందని తెలియజేశారు. ఇన్ని సంఘటన నేపథ్యంలో రమాదేవి ది ఆత్మహత్య అనడం నమ్మశక్యంగా లేదని కమిటీ అభిప్రాయపడినట్లు వారు విలేకరులు తెలియజేశారు. జరిగిన దారుణ సంఘటనపై ఎలాంటి ప్రలోభాలకు పోలీసులు లొంగకుండా ఉన్నత స్థాయి అధికారుల చేత విచారణ జరిపి తల్లి బిడ్డల మృతికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పౌర హక్కుల సంఘం ఉపాధ్యక్షులు రెడ్డయ్య, ప్రధాన కార్యదర్శి రాయచోటి రవిశంకర్, మోటపోతుల రవిశంకర్, ఇర్షాద్, రజక సంక్షేమ సంఘం అధ్యక్షులు రమేష్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు.

త్యాగమూర్తిశర్మ మృతి సాహితీ లోకానికి తీరని లోటు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పురాణం త్యాగమూర్తి శర్మ (ఫైల్‌ఫొటో)

సాహితీ కురువృద్ధ భీష్ముడుగా మదనపల్లెలో ప్రసిద్ధి గాంచిన పురాణం త్యాగమూర్తి శర్మ గత రాత్రి బెంగళూరులో అనారోగ్య కారణంగా మృతి చెందడం బాధా కరమని టిఎస్ఎ కృష్ణమూర్తి, డాక్టర్ గొల్లపూడి తిరుపతిరావు, ఎన్.మునిగోపాల కృష్ణ, డాక్టర్ అప్పినపల్లి భాస్కరాచారి, లింగాల యుగంధర్ ఆచారిలు విచారం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆదివారం వారు మాట్లాడుతూ మెక్సా స్థాపకులలో ఒకరుగా, మదనపల్లి చేతన కళా పరిషత్ కార్యదర్శిగా, మదనపల్లి రచయితల సంఘం కార్యదర్శిగా, అధ్యక్షులుగా ఎనలేని సాహితీ సేవలను త్యాగమూర్తి శర్మ అందించారని గుర్తు చేశారు. మదనపల్లెలో దాదాపు 45 నాటకాలు వేయించి మదనపల్లి ఖ్యాతిని రాష్ట్రవ్యాప్తం చేశారని కొనియాడారు. పద్యం మీద మంచి పట్టున్న వీరు ఇటీవల కాలంలో మూడు గ్రంథములను ప్రచురించారన్నారు. మదనపల్లె రచయితల సంఘం ద్వారా గత కాలంలో వెలువడిన మారసం కథా గుచ్ఛం, మరసం సాహితీ సౌరభాలు గ్రంథాలకు కరణం బాలసుబ్రమణ్యం పిల్లై జతలో సంచాలకత్వం వహించారు. జిడ్డు కృష్ణమూర్తి జన్మస్థానమైన భవనానికి ఇన్‌ఛార్జిగా సేవలందించారు .ఆంగ్ల భాష నుంచి అనేక చారిత్రక అంశాలను తెలుగులోకి అనువదించారు. ప్రఖ్యాత రచయిత సిహెచ్ వెంకటరత్నం (ద్వారకా) సారథ్యంలో నడిచిన ఆలోచించండి మాసపత్రికకు చాల కాలం పాటు ఎడిటర్‌గా పనిచేశారన్నారు. శతావధాని సివి సుబ్బన్న మొదలు శ్రీశ్రీ వరకూ అనేకమంది కవులు, పండితులు, రచయితలను మదనపల్లెకు రప్పించి స్వయంగా ఆదిత్య మిచ్చి కార్యక్రమాలు నిర్వర్తింపజేశారన్నారు. వేదవిహిత కర్మలను ఎలా ఆచరించాలో ఆసక్తి కలవారికి ఎంతో వివరంగా బోధించే వారన్నారు. ఆయన అకాల మరణం సాహితీ లోకానికి తీరని లోటని వారు వెల్లడించారు. ఆయన మృతి పట్ల పట్టణంలోని ప్రముఖులు, రాజకీయ నాయకులు, పాత్రికేయులు సంతాపం తెలిపారు.

సత్తా చాటిన మదనపల్లె యూత్ కరాటే క్లబ్ విద్యార్థులు

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

కరాటేలో మదనపల్లె యూత్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ప్రతిభ కర్ణాటక రాష్ట్రం బెంగుళూరులో జరిగిన జాతీయ స్థాయి కరాటే, కుంగ్‌ఫు ఓపెన్ పోటీలలో పాల్గొన్న వివిధ రాష్ట్రాల వారిని మంత్రముగ్ధులను చేశాయి. ఆదివారం కర్ణాటక రాష్ట్రం బెంగళూరు పట్టణం, హెూసూర్ మెయిన్‌రోడ్ ఎన్.ఎం.ఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఎస్.ఎస్.కె.గోజిరియో కరాటే చీఫ్ రిఫ్రీ క్యోషి ఎం.కన్నన్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి కరాటే, కుంగ్ ఫూ ఓపెన్ ఛాంపియన్‌షిప్ - 2024 కరాటే పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో మదనపల్లె యూత్ కరాటే క్లబ్ విద్యార్థులు పాల్గొని ప్రతిభను ప్రదర్శించారు. ఇతర రాష్ట్రాల నుంచి హాజరైన వారితో పోటీపడి 14 పతకాలు సాధించారు. వీరిలో కటా విభాగంలో ఎస్.ముహీబుల్ రెహమాన్, మహ్మద్ ఐమన్, ఎస్.కాలేషా మస్తాన్, పి.చారుకేష్ రాయల్, పి.ప్రజ్వల్ రాయల్ ప్రథమ స్థానంలో నిలిచారు. ఎన్.ప్రీతమ్ తేజ్ , కె.థానాష్ కుమార్ రెడ్డి, ఎస్.అర్షియా అంజుమ్ , డి.హేమాన్ష్, బి.తేజస్విని , జి.ప్రణీత్ , ఎస్.చైత్ర మధుర్, డి.ఎల్. భాను ద్విస్థానంలో నిలిచారు. జి.ఇషికా తృతీయ స్థానంలో నిలిచి పతకాలు సాధించారు మదనపల్లె యూత్ కరాటే విద్యార్థుల ప్రతిభను నిర్వహకులు ప్రశంసించారు. ఈ సందర్భంగా గ్రాండ్ మాస్టర్స్ డాక్టర్ ఏ.ఆర్.సురేష్ ను ఎస్.ఎస్.కె గోజిరియో కరాటే చీఫ్ రిఫ్రీ క్యోషి ఎం.కన్నన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. బెంగుళురులో విద్యార్థులు ప్రతిభను చాటడంలో శిక్షణ ఇచ్చిన మదనపల్లె యూత్ కరాటే క్లబ్ అధ్యక్షులు డాక్టర్ ఏ.ఆర్.సురేష్‌ను పలువురు పట్టణ ప్రముఖులు, కరాటే విద్యార్థుల తల్లిదండ్రులు ప్రత్యేకంగా అభినందించారు.

పతకాలు సాధించిన కరాటే విద్యార్థులు

ప్రతి ప్రాజెక్టునూ నింపుతాం

82 టిఎంసిలను నిల్వ చేస్తాం
లీకేజీల నివారణపై దృష్టి పెడతాం
ఇరిగేషన్ చీఫ్ ఇంజినీర్ ఎం.మల్లికార్జునరెడ్డి

ఉమ్మడి జిల్లాలోని ప్రతి సాగునీటి ప్రాజెక్టును నింపుతాం. జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల్లో పూర్తిస్థాయిలో 82 టిఎంసిలను నిల్వ చేస్తాం. ప్రాజెక్టుల లీకేజీల నివారణకు పెద్దపీట వేస్తాం. సాగునీటి ప్రాజెక్టు నిపుణుల సలహాల మేరకు లీకేజీల నివారణ పనులు చేపడతాం. ఉమ్మడి జిల్లాల్లోని చిన్న, మధ్యతరహా, భారీ సాగు నీటి ప్రాజెక్టుల పరిధిలో తక్కువ వ్యయంతో కూడిన డిస్ట్రిబ్యూటరీ పనులు చేపట్టడం వల్ల కలిగే ప్రయో జనాలపై దృష్టి సారించాం. ఉమ్మడి రాష్ట్రంలోనే పెద్దదైన మొగమేరు అక్విడక్ట్‌ను పూర్తి చేయడంపై దృష్టి సారించామని పేర్కొం టున్న ఇరిగేషన్ చీఫ్ ఇంజినీర్ ఎం.మల్లికార్జునరెడ్డితో ముఖాముఖి...

ప్రజాశక్తి - కడపప్రతినిధి



ముఖా ముఖి..

సాగునీటి ప్రాజెక్టుల నీటినిల్వలపై మాట్లాడండి?

జిల్లాలోని ప్రతి సాగునీటి ప్రాజెక్టునూ పూర్తిస్థాయిలో నిల్వ చేయడం ధ్యేయంగా ముందుకెళ్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం కృష్ణాజలాలను ముందుగానే విడుదల చేసింది. దీంతో జిల్లాలోని ఆయకట్టుకు సకాలంలో నీరం దించే అవకాశం ఉంది.

ఉమ్మడి జిల్లాలోని ప్రాజెక్టుల వివరాలు?

ఉమ్మడి జిల్లా పరిధిలో 14 చిన్న, మధ్య, భారీ సాగు నీటి ప్రాజెక్టులు న్నాయి. ఇందులో ఒకటి భారీ, ఐదు మధ్య తరహా ప్రాజెక్టులు ఉన్నాయి. గండికోట, వామికొండ, సర్వరాయసాగర్, పైడిపాలెం, మైల వరం, సిబిఆర్, ఎగువ సగిలేరు, దిగువసగిలేరు, బుగ్గవంక, బ్రహ్మం సాగర్, ఎస్ఆర్-1, ఎస్ఆర్-2, వెలిగల్లు, అన్నమయ్య ప్రాజెక్టులు ఉన్నాయి.

ప్రాజెక్టుల నీటి నిల్వ పరిమాణమెంత?

: జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులు 82 టిఎంసిల నిల్వ సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి. జిఎన్ఎస్ఎస్ పరిధిలో 61 టిఎంసిలు, తెలుగుగంగ పరిధిలో 21 టిఎంసిల నిల్వ సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి. ప్రస్తుతం రిజర్వాయర్లలో 15 టిఎంసిలు మాత్రమే నిల్వ ఉన్నాయి.

అదనపు ఆయకట్టు వివరాలు తెలపండి?

ఉమ్మడి జిల్లాలో సుమారు ఎనిమిది లక్షల ఎకరాల ఆయకట్టు సాగయోగ్యమైనది. రాష్ట్రప్రభుత్వం తక్కువ సమయంలో అదనపు ఆయక ట్టుకు నీరందించడంపై దృష్టి సారించింది. ఇందులోభాగంగా 2024 డిసె ంబర్ నాటికి జిఎన్ఎస్ఎస్ పరిధిలోని సర్వరాయసాగర్, వామికొండ ప్రాజెక్టుల పరిధిలోని 30 వేల ఎకరాలకు సాగునీటిని అందించే దిశగా దృష్టి సారించింది.

డిస్ట్రిబ్యూటరీ పనుల వివరాలు తెలపండి?

జిఎన్ఎస్ఎస్ పరిధిలో ఫేజ్-2లోని ప్యాకేజీ-1, ప్యాకేజీ -2, ప్యాకేజీ-3 పరిధిలోని గండికోట, సర్వరాయసాగర్, వామికొండ తదితర రిజర్వాయర్ల పరిధిలో భూసేకరణ ప్రక్రియ నడుస్తోంది. 372 కిలోమీటర్ల పరిధిలో డిస్ట్రిబ్యూటరీ పనులకు రూ.400 కోట్ల వ్యయంతో మూడు లక్షల ఎకరాలకు సాగునీటిని టెయిలెండ్ వరకు నీటిని అందించే అవకాశం ఉంది.

అదనపు ఆయకట్టు గురించి మాట్లాడండి?

జిఎన్ఎస్ఎస్ ప్రాజెక్టు పరిధిలోని డిస్ట్రిబ్యూటరీ నిర్మాణాలకు రూ.200 నుంచి రూ.400 కోట్లు విడుదల చేస్తే జిల్లాలోని ఆరు లక్షల ఎకరాల్లో మూడు లక్షల ఎకరాలకు డిస్ట్రిబ్యూటరీల ద్వారా నీటిని అం దిస్తాం. ఇందులో పులివెందుల నియోజకవర్గ పరిధిలోనే 1.66 లక్షల ఎకరాలకు డిస్ట్రిబ్యూటరీల ద్వారా సాగునీరు అందించే అవకాశం ఉంది. మిగిలిన తెలుగుంగ ప్రాజెక్టుల పరిధిలో అదనపు ఆయకట్టు అందు బాటులోకి వచ్చే అవకాశం ఉంది. పులివెందుల పరిధిలోని 1.65 లక్షల ఎకరాల్లో 1.25 లక్షల ఎకరాలు మైక్రో ఇరిగేషన్ కింద అందుబాటులోకి వస్తుంది. ఈమేరకు పిబిసి, మైలవరం, 350 కి.మీ, జికెఎల్ఐ కింద 70 కి.మీ మేర చిన్న కాలువలు, పంట కాలువలను పూర్తి చేయడం ద్వారా 30 వేల ఎకరాలకు, పిబిసి కింద 55,500 ఎకరాలకు గానూ 40 వేల ఎకరాలకు, జూన్ నాటికి మిగిలిన ఆయ కట్టుకు నీరందిస్తాం.

సర్వరాయసాగర్ లీకేజీ పనుల సంగతేమిటి?

రూ.212 కోట్లతో సర్వరాయసాగర్ ప్రాజెక్టు పనులకు శ్రీకారం చుట్టాం. లీకేజీ పనులకు సంబంధించి రూ.12.10 కోట్లు, వామికొండ కింద రూ.8 కోట్ల వ్యయంతో కూడిన పనులు ప్రారంభించడమైంది. ప్రతిపాదనలు పంపించడమైంది. డిసెంబర్ నాటికి రిజర్వాయర్ కట్ట కింది భాగంలో నీటి లీకేజీని అరి కట్టడానికి అత్యాధునిక సాంకేతికతో గ్రౌటింగ్ పనులు పూర్తి చేయడంపై దృష్టి సారించాం.

మైక్రో ఇరిగేషన్ తీరుతెన్నుల గురించి వివరించండి?

రూ.1260 కోట్లతో డ్రిప్ ఇరిగేషన్ చేపట్టడమైంది. జికె ఎల్ఐ పరిధిలోని 800 సంపుల్లో ఇప్పటికి 120 సంపులు పూర్తి చేయడమైంది. మిగిలిన నిర్మాణాలను పూర్తి చేయడంపై దృష్టి సారించాం. ఎల్ఎ సంబంధించిన సమస్య కొనసాగుతున్నందున ఆలస్యంగా సాగుతోంది. ఏదేమై నప్పటికీ సాధ్యమైన మేరకు త్వరితగతిన పూర్తి చేయడానికి ప్రాధాన్యత ఇచ్చాం.

చిత్రావతి-ఎర్రబల్లి ఎత్తిపోతల పనుల పురోగతి తెలపండి?

రూ.850 కోట్లతో చిత్రావతి- ఎర్రబలి ఎత్తిపోతల పనులు చేపట్టాం. రూ.250 కోట్ల మేర పనులు పూర్తి చేశాం. రెండు టిఎంసిల నీటిని ఎత్తిపోతల ద్వారా పంపింగ్ చేయాల్సి ఉంది. ఇందులో వేముల, వేంపల్లి ప్రాంతాల్లోని ఆరు చెరువులను నిం పాల్సి ఉంది. అనంతరం వేంపల్లిలోని గిడ్డంగివారి పల్లి చెరువును నీటిని సరఫరా చేయడం ద్వారా 10 వేల ఎకరాల అదనపు ఆయకట్టు లభించే అవకాశం ఉంది. ఎర్రబల్లి ఎత్తి పోతల పనుల వల్ల యుసిఐఎల్ పరిధిలోని ఆరు నిర్వాసిత గ్రామాలకు శుద్ధ జలాన్ని అందిస్తాం.

డ్రౌట్ మిటిగేషన్ ప్రాజెక్టు పురోగతి ఎలా ఉంది?

రాయలసీమ డ్రౌట్ మిటిగేషన్ ప్రాజెక్టు పనుల్ని వేగవంతం చేశాం. సుమారు రూ.ఎనిమిది వేల కోట్లతో పనుల్ని చేపట్టిన సంగతి తెలిసిందే. ఉమ్మడి కడప జిల్లాలో రూ.500 కోట్లతో జిఎన్ఎస్ఎస్ మెయిన్ కెనాల్ విస్తరణ, రూ.650 కోట్లతో గండికోట లిఫ్టు స్కీమ్ పను లతోపాటు మరో రూ.350 కోట్లతో ఇతర పనుల్ని చేపట్టడం జరిగింది. ఈలెక్కన ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 75 వేల ఎకరాల అదనపు ఆయకట్టుకు నీరందించే అవకాశం ఉంది.

పూడిక తీశారు..రాకపోకలు నిలిపేశారు

- కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ఇబ్బందుల్లో ప్రజలు
- తీరు మారని పురపాలక శాఖ

రాజీవ్‌నగర్‌లో రోడ్డుపై వేసిన మురుగు, చెత్త చెదారం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాజంపేట పురపాలక శాఖ తీరుతో ప్రజలు విసిగిపోతున్నారు. డ్రెయినేజీ కాలువల్లో పూడిక తీయక ఎక్కడికక్కడ డ్రెయినేజీ కాలువలు నిండిపోయి రహదారులపై పొంగిపొర్లుతుండడంతో ప్రజల్లో తీవ్రస్థాయిలో అసహనం వెల్లువెత్తడంతో ఇటీవల పురపాలక పరిధిలో కాలువల్లో పూడిక తీయించారు. అనేక ప్రాంతాలలో తీసిన పూడిక తీసినట్లుగానే ఉండడంతో ప్రజలు ఆ దారిలో వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. రాజీవ్‌నగర్‌లోని ప్రధాన డ్రెయినేజీ కాలువలో పూడిక తీసి చెత్తా-చెదారం పెద్ద గుట్టగా రోడ్డుకు అడ్డంగా వేయడంతో ఆ దారిలో పూర్తిగా రాకపోకలు నిలిచిపోయాయి. ఆర్ఎస్ రోడ్డు, కడప-చెన్నై ప్రధాన రహదారికి ఆ వీధి ప్రధాన మార్గం కావడం చేత నిత్యము వందలాదిమంది ఆ మార్గం గుండా ప్రయాణించాల్సి ఉంటుంది. కాంట్రాక్టర్ పురపాలక కార్మికుల చేత కాకుండా బయట కూలీలతో పూడికలు తీయించారు. కాంట్రాక్టర్ చేసిన నిర్వాకానికి సుమారు వారం రోజుల నుంచి ఆ మార్గాన పూర్తిగా రాకపోకలు నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పూర్తిగా రోడ్డును కప్పి వేస్తూ అడ్డంగా వేసిన మురుగును తొలగించి రాకపోకలకు అంతరాయం లేకుండా చూడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. అదే మార్గంలో ఆర్ఎస్ రోడ్డుకు ప్రారంభ దశలోనూ మ్యాన్‌హోల్ తెరిచి మురుగు తొలగించి పై కప్పు వేయకుండా వదిలేశారు. అది ఆర్ ఎస్ రోడ్డు ప్రధాన రహదారి కావడం చేత ఆ మార్గాన వాహన చోదకులు, పాదచారులతో నిత్యం రద్దీగానే ఉంటుంది. రోడ్డుకు ఆనుకొని మ్యాన్‌హోల్ ఉండడం వలన పొరపాటున ఏమరుపాటు వహిస్తే గుంతలో పడక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. చేసిన పనులకు మించి బిల్లులు వసూలు చేసుకుంటూ లక్షలాది రూపాయలు గడిస్తూ కాంట్రాక్టర్లు ఇంతటి నిర్లక్ష్యం వహించడం తగదని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు సమస్యలపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

ఆర్ఎస్ రోడ్డులో తెరచి ఉంచిన మ్యాన్‌హోల్

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి :'సుగవాసి'

ప్రజాశక్తి - రాయచోటి

ప్రాణాపాయ స్థితిలో వున్న వారికి స్వచ్ఛందంగా రక్తదానం చేసి ప్రణాదాతలు కావాలని టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి, టిటిడి పాలకమండలి మాజీ సభ్యుల సుగవాసి ప్రసాద్‌బాబు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని దీపా బ్లడ్ బ్యాంక్‌లో టిఎన్ఎస్ఎఫ్ నాయకులు కటారు శివ ఆధ్వర్యంలో రక్తదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రసాద్ బాబు ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. రక్తం నిల్వలు తదితర అంశాలపై దీప బ్లడ్ బ్యాంక్ నిర్వాహకులను అడిగి తెలుసుకొన్నారు.ఈ సందర్భంగా ప్రసాద్‌బాబు మాట్లాడుతూ ఎంతో మందికి సరైన సమయాలలో రక్తం దొరకక అవస్థలు పడుతూ ప్రాణాలు కోల్పోవాల్సిన దుస్థితి ఉందని అన్నారు. ఇటువంటి సందర్భంలో ఎంతో మంది యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయడం హర్షణీయమని పేర్కొన్నారు. బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేసి రక్తాన్ని నిల్వ ఉంచి అవసరం అయ్యే వారికి రక్తం అందజేస్తున్న బ్లడ్ బ్యాంక్ వారిని కూడా అభినందించారు.18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ రక్తదానం చేయవచ్చన్నారు. రక్తం దానం చేయడం వల్ల ఇంకా ఆరోగ్య వంతులుగా ఉంటారని తెలిపారు. టిఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఇటువంటి సేవా కార్యక్రమాలు చేసి ప్రజల మన్ననలను పొం దాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో దీప బ్లడ్ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ ముడుమాల మల్లికా ర్జునరెడ్డి, సుగవాసి శ్రీనివాసులు, బడిశెట్టి రవి పాల్గొన్నారు.

రక్తదాతను అభినందిస్తున్న సుగవాసి ప్రసాద్‌బాబు

పద్మనాభయ్య దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

శ్రీరామదాసు శ్రీసూక్తులు పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని ఎస్‌బివిడి సభ కార్యాలయంలో ఆదివారం కరస్పాండెంట్ నూకల శ్రీరాములు ఆధ్వర్యంలో కవి రచయిత శ్రీరామదాసు పద్మనాభయ్య (ఆల్ ఇండియా రేడియో ఉపన్యాసకులు) రచించిన శ్రీరామదాసు శ్రీ సూక్తులు అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. గతంలో శ్రీ శాంతి లింగేశ్వర స్తోత్రం నక్షత్రమాల, శ్రీ బావానారాయణ సర్వస్వము, మంచి మాటలు మణిహారము, శ్రీ గౌరీదేవి గొబ్బెమ్మ పాటలు రచనలు చేశారు. ప్రస్తుతం శ్రీరామదాసు శ్రీ సూక్తులు అనే పుస్తకాన్ని ఆవిష్కరించినట్లు తెలపారు. కార్యక్రమంలో విశ్రాంత ప్రధాన ఉపాధ్యాయుడు సుబ్బరాయుడు, స్థానిక సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డి, రచయిత హైమావతి, శ్రీనివాసులు, నరేంద్రనాథ్, రాంబాబు అభినందించారు.

రేపటి నుంచి ఉచిత ఆధార్ కేంద్రాలు: ఎంపిడిఒ

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలో 20 నుంచి 24వ తేదీ వరకు నాలుగు రోజులపాటు ఉచిత ఆధార్ అప్‌డేట్ కేంద్రాలు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ రఘురాం ఒక ప్రకటనలో తెలిపారు. 20న రంగంపల్లె, తిప్పాయపల్లె, 21న కొమ్మనవారిపల్లె సచివాలయం, బావికాడపల్లె జడ్‌పి ఉన్నతపాఠశాల, 22న ఎస్‌బివిడి సభా ఉన్నత పాఠశాల, అనంత సముద్రం గ్రామ సచివాలయం, 23న అప్పయ్య రాజుపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అనంతసముద్రం సచివాలయం 24న కొత్తపేట జడ్‌పి ఉన్నత పాఠశాల, వత్తలూరు ప్రాథమిక పాఠశాలలో ఆధార్ క్యాంపులో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ క్యాంపుల్లో ఇటీవల పుట్టిన పిల్లలకి కొత్త ఆధార్ కార్డులు జారీ చేయడం, ఆధార్ కార్డులు ఉండి పది సంవత్సరాలుగా అప్ డేట్ చేసుకొని వారికి అప్‌డేట్ చేయడం, ఐదేళ్ల దాటిన చిన్నారులకు బయో మెట్రిక్, పేరు, అడ్రస్, మొబైల్ నెంబర్‌లో మార్పులు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ చక్కటి అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

నేడు శ్రీ కోదండరాముడి విగ్రహ ప్రతిష్టాపన

ప్రజాశక్తి- రైల్వేకోడూరు

రైల్వే కోడూరు పట్టణంలోని పగడాల పల్లె నందు సోమవారం శ్రీ సీతారామ లక్ష్మణ హనుమత్ సమేత శ్రీ కోదండ రాముల వారి విగ్రహ ప్రతిష్ట నిర్వహించబడునని పగడాల పల్లె శ్రీరామ పాద సేవకులు తెలిపారు. ఉదయం 5 గంటల పైగా ఆలయశుద్ధి, యంత్రపూజ 6 నుంచి ఏడున్నర గంటలలోగా సింహలగ్నంలో యంత్ర ప్రతిష్ట, విగ్రహ ప్రతిష్టాపన జరుగుతుందని తెలిపారు. ఉదయం 9 గంటలకు అష్టబంధన సమర్పణ తత్వ హోమం, మూలమూర్తి హోమం 108 రకముల షణ్ణవతి, అనుహోమద్రవ్యములతో మహా పూర్ణాహుతి, కలిషోద్వాసన, ప్రధాన కుంభం ఆలయ ప్రదక్షిణం, మహా సంప్రోక్షణ అలంకారం, ప్రాణ ప్రతిష్ట నైవేద్యము, సాతుమొర విశ్వరూప దర్శనం, గ్రామ అర్చన,హారతి,తీర్థ ప్రసాద వినియోగం తదితర కార్యక్ర మాలు నిర్వహించునని భక్తులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. మధ్యాహ్నం 12 గంటలకు అన్న ప్రసాద వితరణ జరుగుతుందని, సాయంకాలం 6 గంటలకు గ్రామోత్సవము అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు.

వాల్మీకిపురం సిఐగా ప్రసాద్ బాబు

ప్రజాశక్తి-వాల్మీకిపురం

సిఐగా బాధ్యతలు చేపట్టిన ప్రసాద్ బాబు

వాల్మీకిపురం సిఐగా ప్రసాద్‌బాబు ఆదివారం పదవీబాధ్యతలు చేపట్టారు. ఎన్నికల అనంతరం జరిగిన బదిలీల్లో భాగంగా రాయదుర్గం నుంచి ఆయన బదిలీపై వాల్మీకిపురంకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని రాత్రి గస్తీని ముమ్మరం చేసి, దొంగతనాలు, దోపిడీలు జరగకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు. ద్విచక్రవాహన దారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, లైసెన్సు, ఇన్సూరెన్స్, వాహన పత్రాలు తమ వద్ద ఉంచుకోవాలని సూచించారు. ఎవ్వరైనా అక్రమాలకు పాల్పడితే ఎంతటివారినైన ఉపేక్షించేది లేదని, చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. పెండింగ్ కేసులపై దృష్టి సారించి, త్వరితగతిన పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. సర్కిల్ పరిధిలో నాటుసారా, గుట్కా, జూదం, అక్రమ మద్యంపై గట్టి నిఘా వుంచి, అక్రమాలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి

వైభవంగా శ్రీ ముత్తు మారమ్మ జాతర

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని నాగిరెడ్డిపల్లెలో వెలసిన శ్రీ ముత్తుమారమ్మ తల్లి జాతర ఆదివారం వైభవంగా జరిగింది. అమ్మవారికి మహిళలు పెద్ద ఎత్తున అంబళ్లను సమర్పించి తమ మొక్కులను తీర్చుకున్నారు. ఆలయ ధర్మకర్త స్వామి ఏలుమలై ఆహ్వానం మేరకు రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథరెడ్డి, రాజ్య సభసభ్యులు మేడా రఘునాథ్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఆలయ మర్యాదలతో శాలువా పూలమాలలతో వారిని సత్కరించారు. అనంతరం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రాజంపేట జడ్పిటిసి దాసరి పెంచలయ్య, గడికోట వెంకట సుబ్బారెడ్డి, అరిగెల సౌమిత్రి, గంపా సుధాకర్, ఆకేపాటి జగదీశ్వర్ రెడ్డి, సుబ్బరామిరెడ్డి, గుండు మల్లికార్జున రెడ్డి, పల్లె గ్రీస్మంత్ రెడ్డి, నందలూరు ఉపసర్పంచ్ ఇబ్బు పాల్గొన్నారు.

లారీ యజమానుల ఆందోళన

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

ఓబులవారిపల్లి మండలం మంగంపేట వైరైటీస్ రవాణా గత మూడు నెలలుగా ఆగిపోవడంతో లారీ యజమానులు ఆదివారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా లారీ యజమానులు సభాపతి, జగత్‌పతి నాయుడు మాట్లాడుతూ మంగంపేట నుంచి ముగ్గు రాళ్లు, పౌడర్‌ను చెన్నై, నెల్లూరు తదితర హార్బర్‌లకు లారీలలో రవాణా చేస్తుండే వారని తెలిపారు. గత మూడు నెలలుగా ముగ్గురాళ్ల రవాణా ఆగిపోవడంతో ఇటు యజమానులు డ్రైవర్లు, క్లీనర్లు తదితరులు ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మంగంపేట ముగ్గురాళ్ల గనులలో రాయి వెలికి తీస్తున్నారని, ఎగుమతి నిలిపివేశారని లారీ యజమానులు ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో లారీ యజమానులుపాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న లారీ డ్రైవర్లు

'మిట్స్' విద్యార్థులకు నాయకత్వ లక్షణాలపై శిక్షణ

ప్రజాశక్తి-మదనపల్లి

అంగళ్ళులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో బిటెక్ సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు నాయకత్వ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ యువరాజ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి రిసోర్సు పర్సన్‌గా అమెరికన్ సొసైటీ ఆఫ్ సివిల్ ఇంజనీర్స్ ఇండియా సెక్షన్ సదరన్ రీజియన్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎస్.ప్రదీప్, ప్రెసిడెంట్, డాక్టర్ ఎస్ కిషోర్, పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ రోజుల్లో ఎక్కువ మంది యువత ఆసక్తి చూపుతున్న కోర్సు ఇంజినీరింగ్ అని, అందులో సివిల్ ఇంజనీరింగ్ మదర్ అఫ్ ఇంజినీరింగ్‌గా పిలుస్తారని అన్నారు. దేశ విదేశాల్లో అపారమైన అవకాశాలు ఉన్నాయని, ఇటీవల నిర్మాణ రంగం అభివృద్ధి పథంలో సాగుతోందని అన్నారు. రాబోయే కాలంలోనూ అభివృద్ధి ఇలాగే ఉండే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని తెలిపారు. ఉద్యోగ అవకాశాలు కూడా మెరుగ్గా ఉంటాయని చెప్పారు. మౌలిక సదుపాయాల కల్పన, భారతీయ ఇంజినీర్లకు అధిక డిమాండ్ ఉన్న చోట సివిల్ ఇంజనీర్ల అవసరం ఉంటుంది. విస్తృత క్షేత్రమైన సివిల్ ఇంజినీరింగ్ కింద గ్రామీణ, పట్టణ ప్రణాళిక, నిర్మాణ, వంతెన, హైడ్రాలిక్, పర్యావరణ, రవాణా, కలప, సర్వేయింగ్, జియోటెక్నికల్, నీటి వనరులు, నిర్మాణ నిర్వహణ మరియు భూకంపం వంటి రంగాలుగా విభజించబడింది. ఇందులో ఏ రంగంలోనైనా సివిల్ ఇంజనీర్లు తమ కెరీర్ని నిర్మించుకోవచ్చు. ఒక సమాజ నిర్మాణంలో సివిల్ ఇంజనీర్లు ప్రముఖ పాత్ర పోషించడమే కాకుండా ఎంతో అద్భుతమైన కళాఖండాలు రూపొందించిన ఘనత వారికి ఉందని అన్నారు. ప్రతి సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థికి అమెరికన్ సొసైటీ ఆఫ్ సివిల్ ఇంజనీర్స్ మెంబర్షిప్ అవసరమని తెలిపారు. విద్యార్థులను నిజమైన సివిల్ ఇంజనీరింగ్ నిపుణులుగా అభివృద్ధి చేయడం, పరిశ్రమ, విద్యాసంస్థల మధ్య అంతరాన్ని తగ్గించడం, ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఇతర ఎఎస్‌సిఇ విద్యార్థి అధ్యాయాలతో అనుసంధానం చేయడం, సహకరించడం వంటివి ముఖ్యమైనవని అన్నారు. ప్రభుత్వ, ప్రయివేట్ ఇతర రంగాల్లో మెరుగ్గా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని, ముఖ్యంగా ప్రభుత్వ రంగంలో, సివిల్ ఇంజనీర్ ఎన్‌టిపిసి సెయిల్, బిహెచ్‌యిఎల్, ఎఎఐ, హెచ్‌ఎఎల్, ఎన్‌ఎఎల్, ఆయిల్ సెక్టార్, వంటి సంస్థల్లో ఉద్యోగావకాశాలు మెరుగ్గా ఉంటాయని వివరించారు. విద్యార్థులు నాయకత్వ లక్షణాలను పెచుకోవాలని సూచించారు. కార్యక్రమం లో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రామనాథన్, సివిల్ విభాగాధిపతి డాక్టర్ దీపాంకర్ రాయ్ పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రదీప్

రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రతిభ చాటిన బాలికల జట్టు

ట్రోఫీని అందుకుంటున్న బాలికలు, పీడీలు రాధారాణి, విజయ భారతి

ప్రజాశక్తి-సుండుపల్లి

ఉమ్మడి అనంతపురం జిల్లా కదిరిలో జరిగిన 46వ రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ బాలికల హ్యాండ్ బాల్ ఛాంపియన్ షిప్ లో కడప జట్టు తృతీయ స్థానం సాధించి కాంస్య పతకాలను కైవసం చేసుకుంది. ఉమ్మడి కడప జిల్లా జట్టు తరపున సుండుపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హ్యాండ్ బాల్ బాలికలు రాష్ట్ర స్థాయి పోటీలలో తమ ప్రతిభను చాటారు. రెండు రోజులు కదిరిలో జరిగిన పోటీలలో కడప జిల్లా బాలికల జట్టు వివిధ జిల్లాలతో జరిగిన పోటీలలో విజయం సాధించి సేమీ ఫైనల్‌కు చేరుకున్నారు.అనంతరం మూడవ స్థానం కోసం జరిగిన పోటీలలో కడప జట్టు నిర్ణీత సమయానికి శ్రీకాకుళం జట్టుతో జరిగిన పోటీలో 4-4తో సమం కావడంతో న్యాయ నిర్ణేతలు రెండు జిల్లాల జట్లను సంయుక్త విజేతలుగా ప్రకటించడంతో కడప జట్టుకు కాంస్య పతకం దక్కింది. కదిరి శాసనసభ్యులు కందికుంట వెంకట ప్రసాద్ కప్పుతో పాటు కాంస్య పతకాలు, ప్రశంస పత్రాలు అందజేసి క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర హ్యాండ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, శ్రీ సత్యసాయి జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు విజయ్ కుమార్ కార్యదర్శి మహేష్, కడప హ్యాండ్ బాల్ సెక్రెటరీ లక్ష్మణ్ తదితరులు పాల్గొని, కడప జిల్లా జట్టులోని సుండుపల్లె,వేంపల్లె పీడీలు రాధారాణి,విజయ భారతిలను,క్రీడాకారులను అభినందించారు. కడప జిల్లా జట్టులో సుండుపల్లె ఉన్నత పాఠశాలకు చెందిన 11మంది బాలికలు, వేంపల్లె కు చెందిన ఐదుగురు బాలికలు పోటీల్లో పాల్గొన్నారు.

కాలం చెల్లిన జ్యూస్ తాగి చిన్నారులకు అస్వస్థత

- షాపు యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి
- కూటమి నాయకులు

ప్రజాశక్తి-వీరబల్లి

కాలం చెల్లి జ్యూస్ అమ్ముతున్న దుకాణ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కూటమి నాయకులు, టిడిపి రాజంపేట పార్లమెంటు మహిళా కార్యదర్శి మల్లూరు సునీత పేర్కొన్నారు. మండలంలోని ఓడివీడు పంచాయతీ కుమ్మరిపల్లిలో కాలం చెల్లిన జ్యూస్ అమ్ముతున్న దుకాణంలో దగ్గర నిరసన తెలిపారు. పిల్లలు కూల్ డ్రింక్ కోసం దుకాణం వద్దకు వెళ్లి జ్యూస్ తీసుకుని తాగినప్పుడు చేదుగా ఉందని పిల్లల చెప్పడంతో పరీక్షించగా జ్యూస్ లో పురుగులు ఉన్నాయని చెప్పారు. పిల్లలు తాగే మ్యాంగో జ్యూస్‌లో పురుగులు ఉన్నాయని దుకాణ యజమానిని ప్రశ్నిస్తే,తయారుచేసి కంపెనీ వద్దకు వెళ్లి అడుక్కోవాలని నిర్లక్ష్య సమాధానం చెప్పారని తెలిపారు. సమాచారం తెలియడంతో టిడిపి రాష్ట్ర నాయకులు శివప్రసాద్ నాయుడు, రాజంపేట పార్లమెంట్ జనసేన నాయకులు రమా శ్రీనివాస్, కూటమినాయకులు వెంకటరామరాజు గ్రామానికి చేరుకుని సంఘటనపై ఆరా తీశారు. గ్రామంలో ఉన్న ఐదు దుకాణాల వద్ద పరిశీలించగా అన్నింటిలో కాలం చెల్లిన టెట్రా ప్యాకెట్లు, జ్యూస్ ప్యాకెట్లు దర్శనమిచ్చాయని తెలిపారు. పిలల్లల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న డీలర్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. తక్షణం ఓదివీడు, కుమ్మరి పల్లెలో దుకాణాలను సంబంధిత అధికారులు మూసివేయాలని వారు డిమాండ్ చేశారు. లేకుంటే కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపడతామని హెచ్చరించారు. ప్రభుత్వం, ఫుడ్ కమిషనర్ అధికారులు స్పందించి దుకాణాలను పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు.

కాలం చెల్లిన జ్యూస్ ప్యాకెట్లను చూపుతున్న స్థానిక ప్రజలు

పిచ్చి కుక్కల దాడిలో 30 మందికి గాయాలు

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

గాయాన్ని చూపుతున్న బాలుడు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

రైల్వే కోడూరు పట్టణంలోని గాంధీనగర్, వడ్డీపల్లి, పగడాలపల్లి, రంగనాయకుల పేట, రెడ్డివారి పల్లి తదితర ప్రాంతాలలో ఆదివారం పిచ్చి కుక్కల దాడిలో 30 మంది గాయపడ్డారు. గాయపడిన వారిని హుటాహుటిన స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో గాయపడిన వారికి ప్రథమ చికిత్సలు అందించినట్లు డాక్టర్ హరికృష్ణ తెలిపారు. తీవ్రంగా గాయపడిన పలువురిని తిరుపతికి తరలించారు. నారాయణరెడ్డి, నిషాద్‌రెడ్డి, రామ్‌చరణ్, శ్రీనివాసులు, జస్విక, రమేష్ నాయుడు, సురేంద్రలు కుక్కల దాడిలో గాయపడ్డారు. వారికి మెరుగైన చికిత్స అందిస్తామని చెప్పారు.

దళిత ఉద్యమాల్లో యువత భాగస్వామ్యం కావాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

దళిత ఉద్యమాల్లో యువత భాగస్వా ములు కావాలని, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్, జ్యోతి రావుపూలే ఆలోచనా విధానం కొనసాగించాలని మాజీ మున్సిపల్ చైర్మన్ హరీంద్రనాథ్, చేనేత కార్మిక ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అవ్వారు మల్లికార్జున, రాయలసీమ ఎస్‌సి, ఎస్‌టి హ్యూమన్ రైట్స్ ఫోరం కన్వీనర్ జె.వి.రమణ అన్నారు. ఆదివారం వైఎస్‌ఆర్ ప్రెస్ క్లబ్‌లో ఆంధ్రప్రదేశ్ దళిత మిత్ర సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కైపు రామాంజనేయులు ఆధ్వర్యంలో మురారి ప్రవీణ్ కుమార్ అధ్యక్షతన సంఘం 7వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్థిక అసమానతలు లేని సమాజాన్ని సృష్టించు కోవాలని హితవు పలికారు. దళితుల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఆర్థిక, రాజకీయ సామాజిక, సాంఘిక రంగాల్లో దళితులు వెనుకబడి ఉన్నారని చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలు కావస్తున్నప్పటికీ దళితులు అభివృద్ధి చెందక పోవడం పాలకుల నిర్లక్ష్యమే కారణమని తెలిపారు. అనంతరం అధ్యక్షుడు కైపు రామాంజనేయులు మాట్లాడుతూ అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని ముందు తీసుకెళ్లేందుకు 2017 లో సంఘాన్ని స్థాపించమని పేర్కొన్నారు. దళితుల, బడుగు, బలహీనవ వర్గాల సంఘాలను ఏక తాటి పై తెచ్చేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. సంగటి మనోహర్ మాట్లాడుతూ అన్ని రంగాల్లో దళితులకు అన్యాయం జరిగిందని, ఆర్థిక సమానత్వం కోసం దళితులు మరో పోరాటం చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. ముందు గా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ల ఐక్యత వర్ధిల్లాలిని నినాదాలు చేశారు. కార్యక్రమం లో జనతా దళ్ నాయకులు ప్రతాప్ రెడ్డి, దళిత మిత్ర సంఘం రాష్ట్ర నాయకులు మదనపల్లె కు చెందిన మబ్బు వెంకట రమణ, జిల్లా అధ్యక్షుడు కైపు బాబు, ఉపాధ్యక్షుడు బాల సుబ్బయ్య , అడ్వకేట్ అమీన్ పీరా, కొత్త పల్లె యల్లయ్య పాల్గొన్నారు.

ప్రకృతిని సంరక్షించుకోవాలి

ప్రజాశక్తి - కడప

సకాలంలో వర్షాలు కురవాలంటే సృష్టిలో ఉండే ప్రకృతిని కాపాడుకోవాలని, సంరక్షించుకోవాలని న్యూ నేటివ్ కృపా మినిస్ట్రీస్ అధ్యక్షులు పాస్టర్ పి. మహేష్, సిస్టర్ శాంతమ్మ సూచించారు. ఆదివారం కడప నగరం బిల్డప్ సమీపంలోని కృపా కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ మానవళితో పాటు సకల జీవరాశులు జీవించాలంటే వర్షాలు కురిస్తేనే భూమిపైన రైతులు పంటలు పండిస్తారని, తాగడానికి నీరు సమృద్ధిగా ఉంటుందని అన్నారు. ఈ ఏడాది వర్ష కాలంలో కూడా ఎండలు మరీ ఎక్కువగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని చెప్పారు. ప్రకృతిని కాపాడుకోవాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కోరారు. కార్యక్రమంలో పి.రవితేజ, నరసయ్య, అగస్టిన్, శాంతి రాజు, రోజా, రామంజినమ్మ, ఎల్లమ్మ, లీలావతి పాల్గొన్నారు.

ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్న పోలీసులు

ట్రాఫిక్ నియంత్రణలో కలకడ పోలీసులు

ప్రజాశక్తి-కలకడ

మండల కేంద్రమైన కలకడలో పోలీసులు ట్రాఫిక్ నియంత్రణలో నిమగ్నమయ్యారు. కలకడ ఎస్‌ఐ రామాంజనేయులు ఆదేశానుసారం మండల కేంద్రమైన కలకడలో బాటసారిలకు, ద్విచక్ర వాహనాలకు, ఇతర వాహనాలకు ఇబ్బందికరంగా ట్రాఫిక్ ఉండడం గుర్తించిన ఎస్‌ఐ తన సిబ్బందితో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టారు. పోలీసు స్టేషన్‌కు ఇటువైపు అటు వైపు ఉన్న కాంప్లెక్స్‌లో ఎదుట తోపుడు బండ్లు, ద్విచక్ర వాహనాలు రహదారిపై నిల బెట్టినచో వారికి అపరాధ రుసుం వేయడం జరుగుతుందని హెచ్చరించారు. కాంప్లెక్స్‌లో ఉన్న రూములు ఎదుట ద్విచక్ర వాహనాలు, ఇతర తోపుడు బండ్లు ఉంచితే చర్యలు తీసుకుంటామని చెప్పారు. డ్రంక్ అండ్ డ్రైవ్ చేసిన వారికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం అపరాధ రుసువులు వేయడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను తప్పక పాటించాలన్నారు. ప్రజలకు ఇబ్బందులులేకుండా పోలీసుల ఆదేశాల పాటించాలని సూచించారు. వాహనాలను ఇష్టానుసారంగా పార్కింగ్ చేస్తే చర్యలు తప్పవని ఎస్‌ఐ హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటించి సహకరించాలని కోరారు.కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ రెడ్డి బాబు, కానిస్టేబుల్ యోగేష్, ప్రతాప్, తాతయ్య, రియాజ్, రమేష్ సిబ్బంది పాల్గొన్నారు.

అభినవ అంబేద్కర్ మందకృష్ణ మాదిగ

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్ : ఎస్‌సి వర్గీకరణ కోసం మొక్కవోని దీక్షతో నిత్య కృషీవలుడు, అభినవ అంబేద్కర్ మందకృష్ణ మాదిగ అని జిల్లా ఎంఇఎఫ్ అధ్యక్షులు పిచికె బాబు పేర్కొన్నారు. ఆదివారం హైదరా బాద్‌లో మందకృష్ణ మాదిగను మర్యాద పూర్వకంగా కలిసి కడప జిల్లా మాదిగ ఉద్యోగుల సమాఖ్య తరఫున ఘనంగా సన్మానించారు. అనంతరం ఎపి జెన్‌కో ఆర్‌టిపిపి ఎంఇఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కె.సాల్మన్, కడప జిల్లా ఎంఇఎఫ్ అధ్యక్షులు పిచ్చికె బాబు మాదిగ మాట్లాడుతూ 30 ఏళ్ల ఎమ్మార్పీఎస్ సుదీర్ఘ పోరాటంలో ఎన్నో కష్టాలు, అవమానాలు, జైలు జీవితాలు భరించి ఒక లక్ష్యంతో బాబా సాహెబ్ అంబేద్కర్ కలలు కన్న సామాజిక న్యాయమైన ఎస్సీ వర్గీకరణ సాధించిన మాదిగ ముద్దుబిడ్డ అని కొనియాడారు.

క్రైం కార్నర్

ఇన్నోవా, బొలెరో ఢీ : ఐదుగురికి గాయాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె బసినికొండ వద్ద ఆదివారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఇన్నోవాలో ప్రయాణిస్తున్న నలుగురితో పాటు బి. కొత్తకోటకు చెందిన బొలెరో డ్రైవర్ రామంజులు సహా ఐదుగురు గాయపడ్డారు. ఘటనపై తాలుకా సిఐ కళా వెంకట రమణ తెలిపిన వివరాల మేరకు.. అనంతపురానికి చెందిన అస్లాంబాషా(58), తన భార్య ఫరీదా, అమ్మ రజియా, తమ్ముడు నూర్ అహ్మద్‌తో కలిసి ఇన్నోవా లో వి.కోట విరుపాక్షిపురానికి వెళ్లారు. పక్షవాతంతో బాధపడుతున్న తల్లికి అక్కడ వైద్యం చేయించుకుని స్వగ్రామానికి తిరుగు ప్రయాణం అయ్యారు. మార్గమధ్యంలోని బసినికొండ వద్ద ఎదురుగా బొలెరో వాహనం ఇన్నోవా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇన్నోవాలో ప్రయాణిస్తున్న నలుగురితో పాటు బొలెరో డ్రైవర్ రామాంజులు గాయపడ్డారు. గాయపడ్డ వారిని 108 సిబ్బంది వెంటనే స్థానిక ప్రభుత్వ సర్వజన బోధనాస్పత్రిక తరలించారు. అత్యవసర విభాగం డాక్టర్లు వారిని పరీక్షించి మెరుగైన వైద్యం అందించడంతో ప్రాణాపాయం తప్పి కోరుకుంటున్నారు. కేసు దర్యాప్తులో ఉందని తాలూకా పోలీసులు తెలిపారు.

లారీ పైనుంచి పడి వ్యక్తికి..

మదనపల్లి : ఇనుప ప్లేట్లను లారీ పై నుంచి కిందకు దింపుతున్న క్రమంలో కింద పడి ఓ కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఘటనపై ముదివేడు పోలీసుల కథనం మేరకు.. కురబలకోట మండలం, మదనపల్లె రోడ్డు, విశ్వం కళాశాల వద్ద ఆదివారం జాతీయరహదారి పనులు చేస్తున్న బీహార్ రాష్ట్రం, కటహర్ జిల్లా, మణియపురకు చెందిన సికిందర్(40), రోడ్డు పనుల కోసం తీసుకువచ్చిన ఇనుప ప్లేట్లను సహచరులతో కలిసి లారీలో నుంచి కిందకు దించుతుండగా, ప్రమాదవశాత్తు సికిందర్ కిందపడి పోయాడు. ఈ ప్రమాదంలో అతని కాళ్ళు, చేతులు, నడుము విరిగి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే బాధితున్ని సహచరులు మదనపల్లె సర్వజన బోధనాస్పత్రికి తరలించారు. ఆస్పత్రి అత్యవసర విభాగం డాక్టర్లు పరీక్షించి మెరుగైన వైద్యం అందించినా పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతికి రెఫర్ చేశారు. ముదివేడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రెండు బైకులు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి..

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్: రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొని ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. తంబళ్లపల్లె ఎస్ఐ లోకేశ్‌రెడ్డి కథనం మేరకు.. మండలంలోని గోపిదిన్నె గ్రామం, రెడ్డివారిపల్లెకు చెందిన శివశంకరరెడ్డి(65) సొంతపని కోసం బైకుపై మదనపల్లెకు బయలుదేరాడు. బైకు కన్నెమడుగు వద్దకు రాగానే మదనపల్లె మండలం, సిటిఎం గ్రామం, దయ్యాలవారిపల్లెకు చెందిన ప్రకాశ్(27) బైకు కన్నెమడుగు వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడగా స్థానికులు వారిని 108లో సర్వజన బోధనాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు..

మదనపల్లె అర్బన్:ద్విచక్ర వాహనాన్ని గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో భార్యా, భర్తకు తీవ్ర గాయాలై అపస్మారక స్థితికి చేరుకున్నారు. ఈ ఘటన గుర్రంకొండ మండలంలో ఆదివారం జరిగింది. ఎస్ఐ మధు రామచంద్రుడు తెలిపిన వివరాల మేరకు.. చిన్నమండ్యం మండలం కేశాపురానికి చెందిన దంపతులు లక్ష్మీదేవి, శివశంకరయ్యలు సొంత పనిమీద ద్విచక్ర వాహనంలో గుర్రంకొండకు బయలుదేరారు. మార్గ మధ్యం లోని చిట్టి బోయినపల్లి వద్దకు వాళ్ల బైకును గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లి పోయింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ దంపతులను గుర్రంకొండ 108 సిబ్బంది చికిత్సల నిమిత్తం హుటాహుటిన మదనపల్లె సర్వజన బోధనాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు చికిత్స అందించినప్పటికీ పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతికి రెఫర్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

యువకుడి ఆచూకీ తెలపండి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్


మహేష్(ఫైల్ ఫొటో)

మదనపల్లె పట్టణం బసినికొండకు చెందిన నాగరాజు కుమారుడు కొమ్మిశెట్టి మహేష్ (18) ఈనెల 15 న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అప్పటి నుంచి కుటుంబ సభ్యులు పలుచోట్ల గాలించినా కనించలేదు. స్థానిక రెండో పట్టణ పోలీసుస్టేషన్‌లో యువకుడి తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు ఆచూకీ తెలిసిన వారు 9440796741 నెంబర్ కు తెలపాలని ఎస్ఐ కోరారు.

వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి-వాల్మీకిపురం

అర్షియా (ఫైల్ ఫొటో)

ఫేస్‌బుక్ ద్వారా పరిచయంమై ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. ఏడాదిన్నరగా సజావుగా ఉన్న సంసారం.. భర్త సౌదీకి వెళ్లడంతో భార్య అత్తారింట్లో కాపురం.. మూడు నెలలుగా భర్త, అత్త, మామ, ఆడబిడ్డ వేధింపులు..దీంతో భరించలేని ఓ వివాహిత ఆదివారం ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందింది. సిఐ ప్రసాద్‌బాబు, ఎస్ఐ శ్రీహరి కథనం మేరకు వివరాలు.. వాల్మీకిపురం పట్టణం కోనేటివీధికి చెందిన అమీర్‌జాన్ కుమారుడు వసీమ్ అక్రమ్ పీలేరు పట్టణం మల్లెలవీధికి చెందిన మల్లెల రెడ్డిబాష కుమార్తె అర్షియా (22)కు ఫేస్ బుక్ ద్వారా పరిచయం అయ్యింది. ఆ పరిచయం కాస్తా ప్రేమగా మారడంతో ఇరువురు ఏడాదిన్నర క్రితం వివాహం చేసుకున్నారు. వివాహం జరిగిన మూడు నెలలకే వసీమ్ అక్రమ్ సౌదీకి వెళ్లిపోయాడు. దీంతో భార్య అర్షియా తమ అత్త, మామలతో కలసి ఉంటుంది. ఈ నేపథ్యంలో సౌదీ నుంచి భర్త, ఇంట్లో ఉన్న అత్త, మామ, ఆడబిడ్డలు వేధిస్తూ.. చిత్రహింసలకు గురి చేసేవారు. మనస్థాపం చెందిన అర్షియా ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొంది. గమనించి స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్ఐ శ్రీహరి సంఘటనాస్థలానికి చేరుకొని, సంఘటనకు గల కారణాలపై ఆరా తీశారు. అనంతరం అర్షియా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీహరి తెలిపారు.

ఎనిమిది మందిపై కేసు నమోదు

ప్రజాశక్తి-కలకడ

ఎనిమిది మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. మండలంలోని గంగాపురం పంచాయతీ గంగాపురానికి చెందిన ముల్లకూరి వెంకటయ్య కుమారుడు ముల్లగూరి రెడ్డయ్య నాయుడు విరూపాక్షమ్మ దేవత జాతరలో భాగంగా ముల్లగూరి రెడ్డయ్య నాయుడు ఈనెల 10న శనివారం దేవతకు మొక్కుబడి తీర్చుకునే తరుణంలో చాందిని బండి కట్టి ఊరేగింపుగా వస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ ఊరేగింపులో భాగంగా దారి ప్రక్కన అదే గ్రామానికి చెందిన బాలినేని శివయ్య కుమారుడు బాలినేని నాగరాజుకు చెందిన ద్విచక్ర వాహనం ఉండడంతో, చాందిని బండి అటువైపు వెళుచుండగా వారిలో ఒక వ్యక్తి ద్విచక్ర వాహనాన్ని క్రింద పడదోసినట్లు గుర్తించిన ముల్లగూరి రెడ్డయ్య నాయుడు కిందపడిన ద్విచక్ర వాహనాన్ని పైకి లేపి నిలబెట్టినట్టు తెలిపారు.ఈ సన్నివేశాన్ని గమనించిన బాలినేని నాగరాజా నా ద్విచక్ర వాహనాన్ని కింద పడేసింది ఎవరి దుర్భాషలాడటంతో గ్రామ పెద్దలు సర్ది చెప్పారని అన్నారు. ఆగ్రహానికి గురైన బాలినేని నాగరాజా మరుసటి రోజు ఆదివారం తన బంధువులైన ప్రసాద్, వెంకటేశ్వర, గౌతమ్, చంద్రయ్య ,వెంకటేశ్వర, ద్వారక ,తిరుపతి అను వ్యక్తులను వెంటబెట్టుకుని వచ్చి కొడవండ్లు, కర్రలు, రాళ్లతో దాడి చేసి గాయపరిచినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు.మొల్లగూరి రెడ్డయ్యనాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు 8 మంది పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పట్టణంలోని డాక్టర్ వైఎస్‌ఆర్ ఉలిమెల్ల లేక్ ఫ్రంట్‌లో ఆదివారం నిర్వహించిన వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి. స్థానిక విజయవాడ ఎక్సలెంట్ ఇన్స్టిట్యూట్ వారి నాగార్జున పాఠశాల పులివెందుల వారి విద్యార్థులచే శాస్త్రీయ, పాశ్చాత్య నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో నృత్య శిక్షకుడు చిట్టి, చందన వినోద్, స్కూల్ కరస్పాండెంట్ గీత, ప్రైమరీ ఇన్‌ఛార్జి మాధవి, పరిపాలన అధికారి సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.